ఓటర్ల లెక్క .. ఇక పక్కా!

- ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న బీఎల్‌వోలు
- కొత్త ఓటర్ల నమోదుకు, మార్పులు, చేర్పులకు అవకాశం
- నియోజకవర్గంలో 94,359 ఇళ్లకు గానూ 73,600 పరిశీలన
- 2,32,891 మంది ఓటర్లకు గానూ 1,36,979 మంది సర్వే పూర్తి
- ఈ నెల 16 నాటికి 58.82 శాతానికి చేరిన సర్వే
- ఈ నెల 21 వరకూ కొనసాగనున్న ప్రక్రియ

సత్తెనపల్లి: మీ ఓటు ఉందా ? ఉంటే ఎక్కడ ఉంది ? చిరునామా మార్చాలనుకుంటున్నారా ? 18 ఏళ్లు నిండినా ఓటరుగా నమోదు కాలేదా ? ఇలాంటి ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు బీఎల్‌వోలు ఇంటింటికీ వస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత నెల 21 వతేదీ నుంచి ఓటర్ల సంక్షిప్త జాబితా సవరణ ప్రక్రియకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.

పకడ్బందీగా ఓటర్ల జాబితా

ఓటర్ల జాబితాను మరింత మరింత పకడ్బందీగా, పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో) వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు. పట్టణంలో, గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి మొబైల్ యాప్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. సవరణలతో పాటు ఫొటో, అడ్రస్ మార్పులు వంటివి ఓటరు ఆమోదంతో చేస్తున్నారు.

2024 జనవరి నాటికి ప్రక్రియ పూర్తి

సార్వత్రిక ఎన్నికలు మరో తొమ్మిది నెలల్లో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ -2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేసి 2024 జనవరి 5న తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. దీంతో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి.



ఇంటింటి సర్వేలో బీఎల్‌వోలు

బీఎల్‌వోలకు రిజిస్టర్లు , దరఖాస్తులు

ఓటరు జాబితా సవరణలో భాగంగా గత నెల 21న ప్రారంభమైన ఇంటింటి సర్వేలో పాల్గొనే బీఎల్‌వోల చేతికి ఓటు సవరణకు సంబంధించిన రిజిస్టర్లు, కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం-6), ఓటు తొలగింపునకు (ఫారం -7), నియోజకవర్గ పరిధిలో ఓటు బదిలీకి (ఫారం -8) దరఖాస్తుల్ని జిల్లా యంత్రాంగం అందించింది. ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. సవరణ పక్కాగా చేపట్టేందుకు ఓటరు యాప్ (వెర్షన్ 4.7) ఇన్‌స్టాల్ చేశారు. కొత్త ఓటు నమోదు, పాతవి తొలగించడం యాప్ లోనే చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఓటు హక్కు పొందాల్సిన వారు దరఖాస్తు నింపి బీఎల్‌వోలకు అందించాలి. ఒకే కుటుంబంలో ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషను అనుసంధానిచేందుకు ఇంటింటా సర్వే ఉపయోగపడుతుంది.

విస్తృతంగా అవగాహన

ఓటర్ల సవరణ ప్రక్రియపై ప్రజలకు అధికార యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారంతో పాటు బీఎల్‌వోలకు, సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కూడా అధికారులు సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల సవరణ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు పూర్తి సహకారం అందించాలని అధికారులు రాజకీయ పార్టీల నాయకులు , ఓటర్లను కోరుతున్నారు.

ఓటు సరి చూసుకోవాలి



బీఎల్‌వోలు ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు ఓటరు ఐడీ కార్డులు, పేరు, చిరునామా, వయస్సు, ఆధార్ ఇతర వివరాలు సరి చూసుకోవాలి. ఫొటో సరిగా లేకపోతే అక్కడికక్కడే అప్‌డేట్ చేసుకోవాలి. తప్పులు సరిదిద్దేందుకు అవసరమైన ఆధారాలను బీఎల్‌వోలకు సమర్పించాలి. ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా, గడువులోగా పూర్తయ్యేందుకు బీఎల్‌వోలకు ప్రజలు, రాజకీయపార్టీల నాయకులు సహకరించాలి. ఈ నెల 21 వరకు జరిగే ఇంటింటా సర్వేను ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాం. ర్యాండమ్‌గా ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో తనిఖీలు చేశా. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, డిలీషన్లను పక్కా ఆధారాలతో నిశితంగా పరిశీలించి ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తాం. వచ్చే జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం.

–బీఎల్ఎస్.రాజకుమారి, ఆర్డీవో, సత్తెనపల్లి

నియోజకవర్గంలో నివాసాలు, ఓటర్లు సర్వే ఇలా...

మండలం	నివాసాలు	సర్వే చేసిన నివాసాలు	ఓటర్లు	సర్వే చేసిన ఓటర్లు	శాతం
సత్తెనపల్లిటౌన్	18,251	15,513	46,264	32,131	69.45
సత్తెనపల్లి రూరల్	25,812	20,649	59,497	36,350	61.10
ముప్పాళ్ల	11,429	8,686	34,681	19,475	56.15
రాజుపాలెం	16,802	12,601	41,033	21,335	51.99
నకరికల్లు	22,065	16,769	51,416	27,688	53.85
మొత్తం	94,359	73,600	2,32,891	1,36,979	58.82

తెగుళ్ల నివారణతోనే పత్తిలో అధిక దిగుబడులు

అమరావతి: సకాలంలో తెగుళ్ల నివారణతోనే పత్తిలో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారులు తెలిపారు. అమరావతిలో గురువారం జిల్లా వనరుల కేంద్రం అధికారులు, లాం ఫాం కీటక విభాగం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతులకు శిక్షణ ఇచ్చారు. క్షేత్ర సందర్శనలో భాగంగా పత్తి పంట స్థితిగతుల్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు పత్తి పంటలో యజమాన్య పద్ధతుల గురించి వివరించారు. లంక భూములున్న ఎస్సీ రైతులకు కార్పొరేషన్, ఉద్యాన శాఖ నుంచి ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని తెలిపారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ పత్తిలో ఆకుమచ్చ తెగులు, పచ్చదోమ నివారణకు ఎకరాకు రీజంట్ 400మి.లీ. తీసాఫ్ రెండు వందల గ్రాములు, ప్రొపికోనజోల్ 20మి.లీ. పిచికారీ చేయాలని రైతులకు పలు సూచించారు. ఎఫ్‌టీసీ డీడీఏ శివకుమారి మాట్లాడుతూ రైతులు అపరాలు, చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. అమరావతి రీసెర్చి స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ లక్ష్మీపతి మాట్లాడుతూ బయో ఫెర్టిలైజర్ వాడటం వల్ల భూమిలో మిగిలిన భాస్వరం కరిగి మొక్కకు అందుతుందని చెప్పారు. డీఆర్సీ ఏడీఏ శివకుమారి మాట్లాడుతూ ప్రతి రైతూ పత్తి పొలంలో గులాబీ రంగు పురుగుల ఉనికిని నిశితంగా గుర్తించాలని సూచించారు. నివారణకు లార్వా, గుడ్ల దశల్లో వేప గింజల కషాయం లేదా వేపనూనె పిచికారీ చేయాలని తెలిపారు. లింగార్షక బుట్టలలో తరచూ ఐదు రెక్కల పురుగులు పడితే లీటరు నీటికి ప్రొఫెనోఫాస్ 2మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2.5మి.లీ. కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తర్వాతి దశలో క్లోరిపైరిఫాస్, లార్విన్ కలిపి పిచికారీ చేస్తే బాగా పని చేస్తుందని చెప్పారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పైరిత్రాయిడ్‌లను పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, మండల వ్యవసాయాధికారి అహ్మద్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అమరావతిలో పత్తి పంటను పరిశీలిస్తున్న లాం ఫారం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

ఇండేన్ గ్యాస్ ఆధ్వర్యంలో సరుకుల విక్రయం

ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో తొలిసారిగా పెదకూరపాడులో ప్రారంభం

పెదకూరపాడు: ఇండేన్ గ్యాస్ తాజాగా నిత్యావసర సరుకుల విక్రయంలోకి ప్రవేశించింది. దీని నిమిత్తం ఐటీసీ, డాబర్, పతంజలి తదితర సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా ఈ సంస్థలకు చెందిన నిత్యావసర సరుకులు, సబ్బులు, గోధుమ పిండి, ఆయిల్, అగర్‌బత్తీలు, బిస్కెట్లు, పాల ఉత్పత్తులు, కాస్మొటిక్స్, తలనూనెలు వంటి ఉత్పత్తుల్ని ఇండెన్ గ్యాస్ డీలర్ల ద్వారా విక్రయించనుంది. తొలిసారిగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెదకూరపాడు సాయిబాబా ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఉత్పత్తుల విక్రయాలు గురువారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జనరల్ మేనేజర్ యోగా రాణి సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులు సిలిండర్ బుక్ చేసుకునే సమయంలోనే నిత్యావసర సరుకులు కూడా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌పీజీ డివిజనల్ హెడ్ జె.మాధవి, చీఫ్ మేనేజర్ భాస్కర్, సేల్స్ ఆఫీసర్ అశోక్ రాజగోపాల్, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఉత్పత్తులను ప్రారంభిస్తున్న యోగారాణి సురేష్

రాజుపాలెంలో జ్వరాలపై ఇంటింటి సర్వే

రాజుపాలెం: స్థానిక జయంతీ కాలనీలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్, సిబ్బంది జ్వరాల సర్వేను నిర్వహించారు. ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వెంకట కృష్ణకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది 125 ఇళ్లను సందర్శించి జ్వరాల పరీక్షలను నిర్వహించారు. ఏ ఒక్కరికీ జ్వరాలున్నట్లు నమోదు కాలేదని డాక్టర్ తెలిపారు. ఇటీవల కాలనీలో ఒక మహిళ డెంగీ అనుమానిత కేసుగా మరణించినట్లు డాక్టర్ తెలిపారు. దీంతో ఆ ఇంటికి చుట్టుపక్కల ఇళ్లలో సర్వేను నిర్వహించినట్లు చెప్పారు. సైడు కాలువల్లో బ్లీచింగ్, సున్నం చల్లించామని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగీ, మలేరియా నివారణకు పరిసరాల పరిశుభ్రత ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి, తిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు రాధ, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న డాక్టర్, సిబ్బంది

విద్యార్థి చదువుకు ఆర్థిక చేయూత

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ముస్లింపేటకు చెందిన ప్రతిభగల విద్యార్థికి స్కూలు ఫీజును గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ప్రతిభ ఉండి ఆర్థిక పరిస్థితుల వల్ల చదవలేని స్థితిలో ఉన్న వారిని ఆర్యవైశ్య యువజన సంఘం గుర్తించి వారికి చేయూత అందిస్తుందన్నారు. అందులో భాగంగా పట్టణానికి చెందిన ఆయాజ్‌కి సంవత్సరం ఫీజు అందించామని తెలిపారు. చదువుల్లో రాణించినట్లయితే ప్రతి సంవత్సరం ఆ విద్యార్థికి ఫీజు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భవిష్య పాఠశాల కరస్పాండెంట్ ఐ.శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్కూల్ ఫీజు అందిస్తున్న కొత్తా రామకృష్ణ

చాగంటివారిపాలెంలో వివాదాస్పద స్థలంపై విచారణ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు గాను వివాదాస్పదంగా ఉన్న స్థలంపై పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ వసంతబాబు, రెవెన్యూ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న మురుగు కాల్వపైన విగ్రహం ఏర్పాటు చేయాలని ఒక వర్గం పనులు చేపడుతోంది. దీనివల్ల అనేక సమస్యలు వస్తాయని గ్రామస్తులు పనుల్ని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఒక వర్గం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు విగ్రహం ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీంతో ఆయన చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ వసంతబాబు, మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ ఏడీ కాంతారావు, తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి గ్రామానికి వెళ్లారు. వివాదస్థలాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల వాదనలు నమోదు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయడం కుదరదని స్పెషల్ కలెక్టర్ వసంతబాబు స్పష్టం చేశారు. ఇరువర్గాల వాదనలపై నివేదిక తయారు చేసి, చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మధిర వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొని వసంతబాబుకు సమస్యల్ని వివరించారు.



ముప్పాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరుపుతున్న డెప్యూటీ కలెక్టర్ వసంతబాబు

విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోదాజాన్‌పాల్ డిమాండ్ చేశారు. విగ్రహాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకునేలా అధికారులు కృషి చేయాలని, లేనిపక్షంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు జిల్లావ్యాప్తంగా దళిత కుల ప్రజా సంఘాల్ని ఏకం చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. మాల మహానాడు సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం, పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్‌బాబు, పలువురు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

సత్తెనపల్లి: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని ఇన్‌చార్జి అగ్నిమాపక బాధ్యుడు ఎం.మోహన్‌బాబు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని భాష్యం పబ్లిక్ స్కూలులో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని ఎలా ఎదుర్కోవాలి? వాటి నుంచి సురక్షితంగా ఎలా బయటపడాలనే ? అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా విద్యార్థులకు వివరించారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.శ్రీనివాసరావు, డి.వి.బి. రెడ్డి, రమణనాయక్, గోవింద్, సుభాని పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాన్ని ఎదుర్కోవడంపై విద్యార్థికి ప్రత్యక్షంగా చూపుతున్న సిబ్బంది

రాష్ట్రాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీకి సైనికులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: రాష్ట్రాభివృద్ధి మంచి మనసున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జేసీఎస్ సైన్యం బీమా నమోదు శిబిరంలో ఆయన పాల్గొన్నారు. గౌరవ అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జి పైలా సోమినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు బీమా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం వై నీడ్స్ జగన్ అనే అంశాన్ని విశదీకరించారు. పార్టీ పటిష్టతకు సచివాలయ కన్వీనర్లు , గృహ సారథులు పట్టుగొమ్మలని, వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షల బీమా అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో పని చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు పాలన అంతా మోసం

ఇచ్చిన హామీల్ని మరచిపోయి ప్రజల్ని మోసం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగిందని ఎమ్మెల్యే నంబూరు విమర్శించారు. విభజన తరువాత ప్రజలు ఎంతో నమ్మకంతో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తే అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ధ్వజమెత్తారు. అందుకే 2019లో ప్రజలు జగనన్నపై నమ్మకంతో 151 అసెంబ్లీ స్థానాల్లో గెలిపించి అఖండ మెజార్టీని అందించారని వివరించారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాలుగేళ్ల పాలన సాగిందని చెప్పారు. ప్రజా సంక్షేమంతో పాటు, అభివృద్ధిలో కూడా జగనన్న పాలన దార్శనికతతో సాగుతోందని తెలిపారు. ఆర్థిక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రం పురోగతి సాధించిందని పేర్కొన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. పాఠశాలలు, రోడ్లు రూపురేఖలు మార్చామన్నారు. పేదల ఆరోగ్యం కోసం ఆసుపత్రుల్ని ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ఇవన్నీ గత టీడీపీ పాలకులు ఎందుకు చేయలేకపోయారో ప్రజలు వారిని నిలదీయాల్సిన అవసరం ఉందని సూచించారు. తనకు మరోసారి అవకాశమిస్తే పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. తన చిరకాల కల అయిన పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి మూడు మండలాలకు సాగు, తాగునీరు అందిస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్నను, తనను తిరిగి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో క్రోసూరు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, సయ్యద్ అబ్దుల్‌రహీం, కోట హరిబాబు, చిల్కా రవి, జెడ్పీటీసీ సభ్యులు షేక్ జమీలా గఫూర్, ఎంపీపీ పి.కోటయ్య, అనుముల కోటిరెడ్డి, సుంకర శ్రీనివాసరెడ్డి, చిల్కా చంద్రయ్య, అనిల్‌కుమార్, బెల్లంకొండ మీరయ్య, పలువురు ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, నియోజకవర్గంలో ఐదు మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు

అచ్చంపేట: బైకును ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన స్థానిక తాళ్లచెరువు మలుపులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లచెరువు చెందిన బత్తుల శ్రీనివాసరావు(40) అచ్చంపేటలో ఉంటున్న అక్క మల్లెల రమణను బైకుపై స్వగ్రామానికి తీసుకెళుతున్నారు. తాళ్లచెరువు మలుపులోకి వెళ్లేసరికి పెట్రోలు బంకు నుంచి వచ్చే మరో బైకును తప్పించే క్రమంలో శ్రీనివాసరావు ప్రయాణిస్తున్న బైక్‌ను మాదిపాడు వైపు నుంచి వచ్చే ట్రాక్టరు ఢీ కొట్టింది. శ్రీనివాసరావుకు తీవ్ర రక్తస్రావమవడంతో 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అక్క మల్లెల రమణకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అచ్చంపేట ఎస్ఐ సీహెచ్. మణికృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్య గోదావరి బ్యాంక్ ముందు ఖాతాదారుల ఆందోళన

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో తనఖా బంగారం వ్యవహారంలో చోటు చేసుకున్న అవతవకలపై అధికారులు వెంటనే స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, ఖాతాదారులు గురువారం ఆందోళన చేశారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు మాట్లాడుతూ బ్యాంకు అధికారులు వెంటనే స్పష్టమైన ప్రకటన చేసి ఖాతాదారులకు భరోసా కల్పించాలని, లేనిపక్షంలో రైతుల్ని సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ పలువురు ఖాతాదారులు రైతులు కావడంతో తాము పెట్టిన బంగారం వస్తువులు సరిపోయాయో లేదో తెలియక సరిపోయినట్లు సంతకం పెట్టి వెళుతున్నారని తెలిపారు. బ్యాంకు అధికారుల కాలయాపనతో ఖాతాదారులు తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు తక్షణమే స్పందించి ఖాతాదారులకు పూర్తి భరోసా కల్పించే ప్రకటన చేయాలని కోరారు. దీనిపై బ్యాంకు మేనేజరు పి.శివశంకర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రెండు రోజుల్లో పూర్తి వివరాలు ప్రకటిస్తామని, ఖాతాదారులు ఆందోళన చెందవద్దని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల ప్రతినిధులు, రైతులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

అంకితభావంతో పనిచేసే సిబ్బందికి గుర్తింపు



నకరికల్లు: అంకితభావంతో పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు వస్తుందని మండల విద్యాశాఖాధికారి బాబురెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాల ఉపాధ్యాయుడు కె. లక్ష్మీనారాయణ ఉద్యోగోన్నతితో, బి.శారద, షేక్ సాజిదా బేగం, జె.వెంకటరమణ సాధారణ బదిలీ కావడంతో గురువారం వారిని ఆహ్వానించి పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పాటు ఒకే పాఠశాలలో పనిచేయడం అసాధారణ విషయమని కొనియాడారు. ఎంఈవో -2 ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల పురోగతిలో ఉపాధ్యాయుల పాత్ర అభినందనీయమని కొనియాడారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేదరమెట్ల స్వామి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల్ని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

భూముల రీ సర్వేపై అభ్యంతరాలకు ఆహ్వానం

నకరికల్లు: భూముల రీ సర్వేపై అభ్యంతరాలుంటే సర్వేయర్లను సంప్రదించాలని తహసీల్దార్ కె.నగేష్ రైతులకు సూచించారు. రీ సర్వేపై మండలంలోని చేజర్ల గ్రామ రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే బృందం, వీఆర్వోలు కలసి రైతులకు చెందిన పట్టా, ప్రభుత్వ భూముల్ని గుర్తించే ప్రక్రియ చేపట్టారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి రైతుకూ 9(2) నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. తద్వారా రైతు అనుభవంలో ఉన్న భూమి విస్తీర్ణం తెలియజేస్తామని, ఈ ప్రక్రియలో అభ్యంతరాలుంటే సత్వరమే తెలియజేయాలని ఆయన కోరారు. గ్రామసభ ద్వారా తెలియజేసి రికార్డు ఆధారంగా సవరించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు చెల్లిసే అదనపు చార్జీల మినహాయింపు

నకరికల్లు: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లిస్తే అదనపు చార్జీల మినహాయింపు ఉంటుందని ఆ శాఖ ఏఈ సురేష్ గురువారం తెలిపారు. శుక్రవారం విద్యుత్ బిల్లు చెల్లించిన వారికి వచ్చే నెల బిల్లులో సర్‌చార్జి, లేట్ ఫీజు ఉండదని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు బిల్లులు కట్టించుకునే సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

శరవేగంగా డబుల్ రోడ్డు నిర్మాణం



క్రోసూరు: అమరావతి -బెల్లంకొండ ప్రధాన రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం మండలంలోని బయ్యవరం-ఊటుకూరు గ్రామాల పరిధిలో జరుగుతున్న పనుల్ని పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని, పనుల్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు.

ఓటరు సర్వే సమగ్రంగా నిర్వహించాలి



సత్తెనపల్లి: ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా పారదర్శకంగా, సమగ్రంగా సర్వే నిర్వహించాలని తహసీల్దార్ ఎస్.సురేష్ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు, ఎన్నికల సూపర్‌వైజర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేను పొరపాట్లు లేకుండా, పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. పలు రెవెన్యూ అంశాలపై చర్చించారు. జగనన్నకు చెబుదాం, జేకేసీ, ఓటీసీ, ఓటీఎస్, ఏపీ సేవా సర్వీసుల్ని పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆర్ఐ ఆదినారాయణ, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బోసు బాబు, సీఎస్ డీటీ అరుణ పాల్గొన్నారు.

రైతు మృతి



పెదకూరపాడు: డెంగీ లక్షణాలతో రైతు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పెదకూరపాడులో చోటు చేసుకుంది. గ్రామంలోని యాదవ బజారుకు చెందిన ఆలా అప్పారావు (51) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం రోజుల కిందట జ్వరం తీవ్రంగా రావడంతో సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆరోగ్యం కుదటపడకపోవడంతో పాటు రక్తకణాలు తగ్గిపోతుండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం రాత్రి అప్పారావు మృతి చెందాడు. భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య సందర్శించి నివాళులు అర్పించారు.

ఎమ్మార్పీయస్ నూతన కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట: ఎమ్మార్పీయస్ అచ్చంపేట మండల శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఎమ్మార్పీయస్ రాష్ట్ర ప్రముఖుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపు మేరకు రాష్ట్ర కో-కన్వీనర్ తుడుం రమేషన్ మాదిగ ఆధ్వర్యంలో మండలంలోని మాదిపాడులో గురువారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాతంగి ఆనందబాబు, కార్యవర్గ సభ్యులుగా యాంపొంగు ఆదాము, తుడుము సుబ్బారావు, నందిగం కనకయ్య, యాంపొంగు అబ్రహం, పాతూరి ప్రకాష్, బంకా పాపయ్య, పాతూరి అబ్రహం, బంకా గోపి, పాతూరి భాస్కరరావు, మాతంగి నాగరాజు నియమితులయ్యారు.